సాక్షి
రంగారెడ్డి

శుక్రవారం ၊ 3 ၊ ఫిబ్రవరి ၊ 2023



తెలంగాణ తరహాలో అభివృద్ధి

తెలంగాణ తరహాలో దేశాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం బీఆర్‌ఎస్‌ని స్థాపించారని సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అన్నారు. 8లో▸

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పూడూరు: మోడల్ స్కూల్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎన్కేపల్లి పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు నుంచి పదో తరగతుల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బోనోఫైడ్, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

మీర్‌ఖాన్‌పేట పంచాయతీ కార్యదర్శి సస్పెండ్

కందుకూరు: మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేటలో కేశంపేట మండలం కొత్తపేట నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన పంచాయతీ కార్యదర్శి కల్పన సస్పెండ్ అయ్యారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందుకు గురువారం ఆమెను జిల్లా పంచాయతీ అధికారి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఆదేశాల వరకు సస్పెన్షన్ ఉంటుందని ఎంపీడీఓ వెంకట్రాములు తెలిపారు.

న్యూస్‌రీల్

వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు

ఇబ్రహీంపట్నం రూరల్: వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల్లోపు అమలు చేయాలని విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట కమిటీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ హరీశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల జేఏసీ చైర్మన్ ఎడ్ల వెంకటేశ్ మాట్లాడుతూ వీఆర్‌ఏలకు ప్రకటించిన పేస్కేల్ అమలు చేయాలని కోరారు. అర్హులకు పదోన్నతులు, వారసత్వ ఉద్యోగాలకు జీవో విడుదల కోసం 80 రోజుల సమ్మె చేశామని.. మంత్రి కేటీఆర్ హామీతో విధుల్లో చేరామని గుర్తు చేశారు. నేటికి సమ్మె విరమించి 100 రోజులు గడిచినప్పటికీ ఎలాంటి జీవో విడుదల కాకపోవడం.. రాష్ట్రవ్యాప్తంగా రూ.23 వేలు జీతం ఇవ్వడంతో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిటీ కో చైర్మన్ జానకీరామ్, జనరల్ సెక్రటరీ నీరటి నర్సింహ, కన్వీనర్ ప్రసాద్, కో కన్వీనర్లు వెంకటయ్య, చిందుల హరినాథ్, వినోద్‌కుమార్, శంకర్‌నాయక్, జగన్, స్వప్న, శ్రీను, శ్రీనివాస్, కుమార్, శివకుమార్, పెంటయ్య, మహేశ్ పాల్గొన్నారు.

ఘట్టుపల్లి ఆలయంలో అమయ్ కుమార్ పూజలు



ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న అమయ్ కుమార్

మహేశ్వరం: ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో జిల్లా నుంచి మేడ్చల్ కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న అమయ్ కుమార్ గురువారం ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనం ఇచ్చారు.అభిషేకం, హారతి, కుంకుమార్చన పలు పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆశీస్సులు, కృప ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో డీఆర్ డీఏ పీడీ ప్రభాకర్, ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి,ఆలయ ట్రస్టీ కోరుపోలు ప్రభాకర్‌రెడ్డి, గ్రామ పెద్దలు, పూజారులు పాల్గొన్నారు.

కంప్యూటర్ కోర్సులో మహిళలకు ఉచిత శిక్షణ

షాద్‌నగర్‌రూరల్: మొయినాబాద్ మండలం చిలుకూరులోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో మహిళలకు కంప్యూటర్ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం జిల్లా మేనేజర్ శైలకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు 18 నుంచి 35 ఏళ్ల వయ సు కలిగి ఉండాలన్నారు.కంప్యూటర్ కోర్సు శిక్షణ కాలం నాలుగు నెలలు మాత్రమే ఉంటుందని, ఉచిత భోజన వసతి కల్పించనున్నట్లు చెప్పారు. శిక్షణ తీసుకువారు కనీసం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని, ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు, ఇంటర్, పదో తరగతి పాసైన సర్టిఫికెట్‌లు (జిరాక్స్), కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రం ,6 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 76600 22523, 76600 22524 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

అద్దె బస్సు డ్రైవర్లు ఆర్టీసీలో భాగమే



మాట్లాడుతున్న డిప్యూటీ ఆర్‌ఎం జగన్

ఇబ్రహీంపట్నం: అద్దె బస్సు డ్రైవర్లు కూడా ఆర్టీసీలో భాగమేనని డిప్యూటీ ఆర్‌ఎం జగన్ అన్నారు. అద్దె బస్సు డ్రైవర్ల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఇబ్రహీంపట్నం డిపోలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిర్‌బస్ డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదగా మెలగాలన్నారు. సురక్షితమైన డ్రైవింగ్ చేస్తూ ప్రయాణికులను క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ శ్రీను, ఎస్‌టీఐ సౌజన్య, అద్దె బస్సు ఓనర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

సవాళ్ల స్వాగతం

కొత్త కలెక్టర్‌కు కఠిన పరీక్ష

- బాధ్యతలు స్వీకరించిన హరీశ్
- బదిలీపై వెళ్లిన అమయ్‌కుమార్‌కు వీడ్కోలు పలికిన ఉద్యోగులు



కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న హరీశ్, చిత్రంలో బదిలీపై వెళ్తున్న అమయ్‌కుమార్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కొత్త కలెక్టర్‌గా హరీశ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్లుగా ఇక్కడ పని చేసిన డి.అమయ్‌కుమార్ రిలీవై.. జిల్లా రెవెన్యూ బాధ్యతలను కొత్తగా వచ్చిన హరీశ్‌కు అప్పగించారు. జిల్లా అధికారులు ఆయనకు బొకెలు, శాలువాలతో స్వాగతం పలికారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన అమయ్‌కుమార్‌కు వీడ్కోలు పలికారు. మేడ్చల్ కలెక్టర్‌గా శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హరీశ్‌కు జిల్లాలో పలు సమస్యలు, సవాళ్లు స్వాగతం పలుకనున్నాయి. ఉమ్మడి జిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా పని చేసిన అనుభవం ఉండటం, జిల్లా రెవెన్యూపైనే కాకుండా ప్రజా సమస్యలు, రాజకీయ పరిణామాలపై పూర్తిస్థాయి పట్టు ఉండటం కలిసి వచ్చే అంశం.

సవాల్‌గా ప్రభుత్వ భూముల రక్షణ

జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్ భూములు అనేకం అన్యాక్రాంతం అయ్యాయి. ఇప్పటికీ వందల ఎకరాలు కబ్జాదారుల చేతుల్లో ఉండిపోయాయి. ప్రభుత్వంలోని కొంత మంది పెద్దలే ఆక్రమణలను ప్రోత్సహిస్తుండటంతో రెవెన్యూ యంత్రాంగం కూడా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితికి చేరింది. కళ్ల ముందే కోట్ల రూపాయల విలువ చేసే భూమి కదలిపోతున్నా.. ఏమీ చేయలేని పరిస్థితి. బాలాపూర్, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, శంకర్‌పల్లి, మొయినాబాద్, శంషాబాద్ మండలాల్లో భూములకు కనీస రక్షణ లేకుండా పోతోంది. విలువైన ఈ భూములను ఎలా కాపాడనున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇదిలా ఉంటే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యాచారం ఫార్మాసిటీ పనులు, భూసేకరణ, నష్టపరిహారం చెల్లింపు వ్యవహారాలు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌కు సవాల్ విసరనున్నాయి.

ధరణి చిక్కులు విప్పుతారా?

భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా ప్రభుత్వం తెచ్చిన ధరణి సాంకేతిక పరిజ్ఞానం ఇప్పటికీ పలు సమస్యలకు కారణమవుతోంది. రెండేళ్లలో జిల్లా వ్యాప్తంగా ధరణి పోర్టల్‌కు 1.80 లక్షలకుపైగా దరఖాస్తులు రాగా, వీటిలో ఇప్పటి వరకు 1,02, 575 దరఖాస్తులకు మోక్షం లభించింది. మరో 80 వేల వరకు తిరస్కరణకు గురయ్యాయి. వీటిలో మెజార్టీ దరఖాస్తులు భూ ఆక్రమణలు, కబ్జాలు, కోర్టు కేసుల వంటి వివాదాలకు సంబంధించినవే. నిత్యం వంద మందికిపైగా భూ బాధితులు కలెక్టరేట్‌కు వచ్చివెళ్తున్నారు. ఒక సమస్యను పరిష్కరిస్తే.. మరో సమస్య వచ్చి పడితోంది. ధరణి చిక్కులను సమర్థవంతంగా విప్పుతారా? లేదో వేచి చూడాల్సిందే.

విరమింపజేస్తారా..?

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల సర్వే నంబర్ 268లోని మైనింగ్‌జోన్‌లో సుమారు 450 ఎకరాల భూములు కోల్పోయిన 150 మంది రైతులు 171 రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. చందనవెళ్లి పారిశ్రామికవాడకు సుమారు రెండు ఎకరాల భూములను ఇచ్చిన భూ బాధితులు ఇప్పటికే 190 రోజుల పాటు ఆందోళనలు చేశారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. అఖిలపక్ష నేతలు, స్థానిక ఎమ్మెల్యే హామీతో తాత్కాలికంగా ఆందోళన నిలిపివేశారు. కొత్తూరు, కడ్తాల్ తదితర ప్రాంతాల్లో మైనింగ్ జోన్లకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. సమస్యకు పరిష్కార మార్గం చూపించి, రోజుల తరబడి కొనసాగుతున్న ఈ ఆందోళనలను శాశ్వతంగా విరమింపజేస్తారా? లేదా వేచి చూడాల్సిందే.

నిలువ నీడ కల్పిస్తారా..?

నిరుపేదలకు వైఎస్సార్ హయాంలో అబ్దుల్లాపూర్‌మెట్, కుంట్లూరు, నాగన్‌పల్లి, మునుగనూర్, కందుకూరు, జాఫర్‌గూడ ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఆయా లబ్ధిదారులకు ఇప్పటి వరకు పొజిషన్ చూపించ లేదు. సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఇటీవల ఆయా భూముల్లో గుడిసెలు వేశారు. క్లిష్టమైన ఈ సమస్యను ఎలా పరిష్కరించనున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. జిల్లా వ్యాప్తంగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం లక్ష మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. 6,700 ఇళ్లకు ప్రస్తుతం 2,500 మాత్రమే తుది దశలో ఉన్నాయి. అర్హుల జాబితా తయారీ, ఇళ్ల పంపిణీ వంటి అంశాలు కలెక్టర్‌కు కొత్త సవాళ్లు విసరనున్నాయి.

సవాల్‌గా ఉద్యోగుల బదిలీలు

ఉపాధ్యాయుల బదిలీలకు ప్రభుత్వం ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసి, ప్రక్రియ కూడా మొదలు పెట్టింది. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహణ కోసం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. కౌన్సెలింగ్‌కు ముందే కొంత మంది దొడ్డిదారిన వచ్చి పోస్టులు పొందారు. ఇప్పటికే ఈ అంశంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. త్వరలోనే ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. క్లిష్టమైన ఈ ప్రక్రియను ఎంత సమర్థవంతంగా నిర్వహించనున్నారో చూడాలి. అంతే కాదు ప్రభుత్వం వీఆర్‌ఓలను ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. పేస్కేల్, సర్వీస్ రూల్స్ వంటి అంశాలపై ఇప్పటికీ ఓ క్లారిటీ లేకపోవడం వంటి అంశాలు కొత్త కలెక్టర్‌కు సవాల్‌గా మారే అవకాశం ఉంది.



అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమైన మంత్రి సబితారెడ్డి

పన్నుల తగ్గింపుపై తీర్మానం చేయండి

మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలో ఇంటి పన్నుల భారాన్ని తగ్గించేందుకు వెంటనే కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని, దాన్ని ప్రభుత్వానికి పంపుతామని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మీర్‌పేటలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఇంటి పన్నుల తగ్గింపుపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో మొత్తం 19,500 ఇళ్లు ఉన్నాయని, ఇందులో 4వేల ఇళ్లకు మాత్రమే కొత్త పద్ధతిలో పన్నులు పెంచినట్లు తెలిపారు. వాటి పన్నులు తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు చెప్పారు. ఏనాడూ ఇంటి పన్నులు తగ్గించే ఆలోచన చేయని కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వెంటనే తీర్మానం చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను మంత్రి ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు అనిల్‌యాదవ్, ముద్దా పవన్‌కుమార్, ఉయ్యాల నవీన్‌గౌడ్, బీఆర్‌ఎస్ మీర్‌పేట అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ పంతంగి మాధవి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అన్నివిధాలా అండ

బడంగ్‌పేట్: మహిళలు తమకాళ్లపై తాము నిలబడి స్వశక్తితో ఎదిగేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ తోడ్పాటునందిస్తున్నారని విద్యాశాఖమంత్రి సబితా రెడ్డి పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో గురువారం యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో స్వయం సహాయ సంఘాలకు చెక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళా సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. మహిళాభివృద్ధికి బ్యాంకుల సహకారం అందించడం సంతోషకరమన్నారు. స్వయం సహాయక రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ చిగురింత పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, మాజీ కౌన్సిలర్లు, సిబ్బంది, మహిళా గ్రూపు సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీల్లో కొత్త కోర్సులు

కొడంగల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో రాష్ట్రవ్యాప్తంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టి, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలంగాణ కళాశాల ఉన్నత విద్యా విభాగం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డీఎస్‌ఆర్ రాజేందర్ సింగ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గురువారం ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 132 గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలు ఉన్నాయని తెలిపారు. ఇందులో 11 కాలేజీలు స్వయం ప్రతిపత్తి కలిగి ఉన్నాయన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 50 రకాల కాంబినేషన్ కోర్సులు ప్రవేశపెట్టామని స్పష్టం చేశారు. డిగ్రీలో టెక్నాలజీ, సెరికల్చర్, మైక్రో బయాలజీ, బీఎస్సీ కంప్యూటర్, బీకాం కంప్యూటర్, బీబీఏ గేమింగ్, బీఎస్సీ హానర్స్, మిషన్ లర్నింగ్, డాటా సైన్స్ తదితర ఉన్నతమైన కోర్సులు ప్రవేశపెట్టి గ్రామీణ విద్యార్థులకు ఉచితంగా మెరుగైన విద్య అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ సిటీ కాలేజీలో ఎమ్మెస్సీ స్టాటిటిక్స్ కోర్సును ప్రవేశపెట్టినట్లు చెప్పారు.

ధర్మ పరిరక్షణకు పాటుపడాలి

- టీటీడీ ప్రవచనకర్త శివనాగలక్ష్మి

షాద్‌నగర్‌రూరల్: మనం ధర్మాన్ని కాపాడితే అదే మనల్ని రక్షిస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రవచనకర్త శివనాగలక్ష్మి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గురువారం ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్టలోని శివహనుమాన్ దేవాలయంలో ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివనాగలక్ష్మి ఉపన్యసిస్తూ.. ప్రతిఒక్కరూ ధర్మాన్ని పాటించి సమాజహితం కోరాలని సూచించారు. ధర్మస్థాపనకోసం పరితపించే వారికి తప్పనిసరిగా శుభాలు కలుగుతాయన్నారు. మనం ఎంత బలవంతులమనేది ముఖ్యం కాదని, పదిమంది మంచికోసం సమయానికి తగినట్లుగా వ్యవహరిస్తూ ముందుకు సాగినవారే నిజమైన బలవంతులని పేర్కొన్నారు. మన బంధాలు, బంధుత్వాలు ఎలా ఉండాలనేది రామాయణం.. ఎదుటివారిని ప్రేమ, భక్తితో ఏ విధంగా జయించాలనేది మహాభారతం వంటి ఇతిహాసాలు నేర్పిస్తాయన్నారు. ప్రపంచంలో తల్లిదండ్రులను మించిన గురువులు లేరన్నారు. మనకు జన్మనిచ్చిన వారే మొదటి గురువులన్నారు. కర్మ ఫలానికి ఎవరూ అతీతులు కాదని, తప్పు చేసి న వారు తమ కర్మ ఫలాన్ని అనుభవించి తీరాల్సిందేనని పేర్కొన్నారు. ఈ భూమిపై జన్మించినందుకు పది మందికి మంచి, సమాజ హితం కోసం పని చేయాలన్నారు. కార్యక్రమంలో టీటీడీ ప్రవచనకర్త నక్క నర్సింలు, భజన బృంధం సభ్యు లు వడ్ల సుదర్శన్‌చారి, నారం రాంరెడ్డి, బెంది నర్సింహారెడ్డి, క మ్మరి సుధాకర్‌చారి, నీరటి నారాయణ, ఇస్తారి, శంకరయ్య,అరుణమ్మ, అంజమ్మ, పోచమ్మ, సత్యమ్మ, లక్ష్మమ్మ, యాదమ్మ, శివభక్తులు కృష్ణయ్య, ఆంజనేయులు, శివ, మహేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈ- రేస్..

భారత్‌దే భవిష్యత్

ఇక్కడ నైపుణ్యమున్న రేసర్లకు కొదవలేదు

- రానున్న కాలం ఎలక్ట్రానిక్ వాహనాలదే
- ఫార్ములా–1 నుంచి ఫార్ములా–ఈ వైపు ఆసక్తి
- మహీంద్రా రేసింగ్‌తో మంచి ఫలితాలు
- 'సాక్షి'తో బ్రెజీలియన్ రేసర్ 'లుకాస్ డి గ్రాసీ'



సాక్షి, సిటీబ్యూరో: మరికొద్ది రోజుల్లో భాగ్యనగరం వేదికగా దేశంలోనే మొదటిసారిగా తలపెట్టిన ఫార్ములా ఈ –రేసింగ్ చాంపియన్‌షిప్‌లో అంతర్జాతీయ రేసర్లు పాల్గొనున్నారు. ఇందులో భాగంగా మహీంద్రా రేసింగ్ తరఫున ప్రముఖ బ్రెజీలియన్ ఫార్ములా రేసర్ 'లుకాస్ డి గ్రాసీ' హైదరాబాద్‌కు వచ్చారు. లుకాస్ 2014లో బీజింగ్ ఈ–ప్రిక్స్‌లో మొట్టమొదటి ఫార్ములా ఈ– రేస్‌ను గెలిచారు. 101 రేసులు, 40 పోడియంలు, 13 విజయాలతో ప్రపంచవ్యాప్తంగా అత్యంత విజయవంతమైన ఫార్ములా డ్రైవర్లలో ఒకరుగా నిలిచారు. సియోల్ వేదికగా 100 రేసుల మార్క్‌ను చేరుకున్న మొట్టమొదటి రేసర్‌గా చరిత్ర సృష్టించారు. ఫార్ములా ఈ–ప్రస్థానంలో మూడో తరంగా ప్రత్యేకతగాంచిన జెన్– 3లో తన సామర్థ్యాన్ని మరోసారి నిరూపించుకోవడానికి మహీంద్రా రేసింగ్‌తో కలిసి పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో 'లుకాస్ డి గ్రాసీ' ఫార్ములా ఈ– ప్రిక్స్ గురించి లుకాస్ వివరించారు. ఆ విషయాలు ఆయన మాటల్లోనే..

మంచి పరిణామం

భౌగోళికంగా, ఆర్థిక వ్యవస్థ, జనాభా తదితర అంశాల్లో ఎంతో దృఢమైన దేశం భారత్. ఇలాంటి అత్యంత సామర్థ్యవంతమైన వేదికపై ఫార్ములా ఈ– రేసింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్ నిర్వహించడం మంచి పరిణామం. గ్లోబల్ మార్కెట్‌ను ప్రభావితం చేయడంలో భారత్ ప్రధానమైనది. ఈ– ఫార్ములా, ఈ– చాంపియన్‌షిప్‌లో గట్టి పోటీ ఉంటుందని భావిస్తున్నాను. ఇక్కడ మంచి నైపుణ్యమున్న రేసింగ్ ఔత్సాహికులు ఉన్నారు. భారత్ రేసర్లకు ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్‌లో ఫార్ములా ఈ– చాంపియన్‌షిప్‌లో ఈ దేశం ప్రత్యేకతను సంతరించుకునే అవకాశముంది.

ఎక్కువ మంది ఆసక్తి..

ప్రస్తుతం ఫార్ములా–1 నుంచి ఫార్ములా–ఈ లోకి ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు. ఫార్ములా–ఈ రేసింగ్ మిగతా విభాగాలకంటే భిన్నంగా ఉంటుంది. ఫార్ములా–ఈలో అత్యధిక వేగంతో, తక్కువ బరువుతో అధునాతన సాంకేతిక పరిణామాలు చోటుచేసుకున్నాయి. గతంలో రేసింగ్ కార్ల తయారీ వాటి సామర్థ్యం రేసింగ్ అనుకూలతలు ఫార్ములా–ఈతో సరితూగలేవు. ముఖ్యంగా జెన్3 కార్లు 600 కిలో వాట్స్ చార్జింగ్ సామర్థ్యంతో గంటకు 300 కిలో మీటర్ల వేగంతో దూసుకుపోతున్నాయి.

ఆరోగ్యకర ఆహారం..

వ్యక్తిగతంగా హైదరాబాద్ రేస్ వీక్‌లో పాల్గొనడానికి అన్ని విధాలుగా సంసిద్ధంగా ఉన్నాను. భారత్‌కు రావడం ఇది మూడోసారి. భారత్ వేదికగా ఆహారంలో జాగ్రత్త వహించాలని నిర్ణయించుకున్నాను. ఆరోగ్యకరమైన ఆహారం, కూరగాయలు, మాంసం, కార్బోహైడ్రేట్లు తీసుకుంటాను. భారత్, బ్రెజిల్, మెక్సికో వంటి దేశాల్లో ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. జంక్ ఫుడ్‌ను నివారిస్తే ఫుడ్ ఇన్‌ఫెక్షన్లకు దూరంగా ఉండొచ్చు. ఇంధన సంరక్షణ కోసం 2007లో నా స్వచ్ఛంద సంస్థ 'స్మార్టర్ డ్రైవింగ్'ను ప్రారంభించాను. అయిదేళ్ల పాటు సంస్థ తరఫున పలు కార్యక్రమాలను నిర్వహించాను. అంతేకాకుండా పలు ఎన్‌జీఓలతో కలిసి పని చేశాను. నా విజయ ప్రస్థానంలో మా అమ్మ ప్రోత్సాహం కీలకమైంది.

భారత్‌లో ఎలక్ట్రిక్ టెక్నాలజీ భేష్..

భారత్‌లోఎలక్ట్రిక్ టెక్నాలజీ, మొబిలిటీ అద్భుతంగా కొనసాగుతోంది. ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు, కార్ల వినియోగం, ఉత్పత్తి అధికంగా ఉంది. ఈ రంగాన్ని అగ్రగామిగా మార్చడానికి భారత్‌లో మహీంద్రా వంటి సంస్థలు విశేష కృషి చేస్తున్నాయి. భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వాహనాలకే ప్రాధాన్యం పెరగనుంది. మహీంద్రాతో కలిసి నా ప్రయాణం అద్భుతంగా సాగుతోంది. మెక్సికో వేదికగా మొదటి సీజన్ రేస్‌లో 3వ స్థానంతో పూర్తి చేశాం. ప్రస్తుతం భారత్‌లో జరగనున్న ఫార్ములా–ఈ రేసింగ్‌తో పాటు రియాద్‌లో జరిగే రేస్ ఈవెంట్లలో మరింత మంచి ప్రదర్శన ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



పాదయాత్ర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఇబ్రహీంపట్నం: పంచాయతీ కార్మికులకు వేతనం పెంచాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా స్థాయి విస్తృత సమావేశాన్ని గురువారం ఇబ్రహీంపట్నంలోని పాషనరహరి స్మారక కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్లుగా అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచకపోవడం సరైంది కాదన్నారు. కార్మికులకు వేతనాలు పెంచి కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని, దళితబంధు పథకం అమలు పర్చాలని, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్న డిమాండ్లతో ఈనెల 12 నుంచి పాదయాత్ర చేయనున్నట్లు చెప్పారు. వీరనారి చిట్యాల ఐలమ్మ స్వగ్రామమైన పాలకుర్తి నుంచి పాదయాత్ర ప్రారంభమై 28న ఇందిరాపార్కు వద్ద ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయ తీ యూనియన్ రాష్ట అధ్యక్షుడు పాండు, రాష్ట ఉపాధ్యక్షుడు సుధాకర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేశాయ్ ఈ- రేసింగ్ కార్లు

- రియాద్ నుంచి బోయింగ్‌లో విడి భాగాలు
- మరో రెండు విమానాల్లో రానున్న మరిన్ని
- జీఎంఆర్ కార్గోలో దిగిన 83 బాక్సులు



రియాద్ నుంచి వచ్చిన బోయింగ్ విమానం నుంచి దిగుతున్న ఈ- రేసింగ్ కార్ల విడిభాగాలు



జీఎంఆర్ కార్గోలో దిగిన ఈ రేసింగ్ కార్ల విభాగాలు

శంషాబాద్: భాగ్యనగరంలో రయ్..రయ్యంటూ దూసుకుపోయేందుకు ఈ–రేసింగ్ కార్లు వచ్చేశాయి. త్వరలో ప్రతిష్టాత్మకంగా జరగబోయే ఫార్ములా ఈ–వరల్డ్ చాంపియన్ షిప్ పోటీల్లో వినియోగించే ఈ– రేసింగ్ కార్ల విడిభాగాలు అర్ధరాత్రి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని జీఎంఆర్ కార్గోలో దిగాయి. రియాద్ అర్ధరాత్రి 12 గంటల సమయంలో 747–400 బోయింగ్ విమానంలో 90 టన్నుల బరువు కలిగిన 83 బాక్సుల్లో విడిభాగాలు వచ్చాయి. కస్టమ్స్ క్లియరెన్స్ ప్రక్రియకు జీఎంఆర్ కార్గో ప్రత్యేక ఏర్పాట్లు చేసింది . కార్గోలోని ప్రత్యేక హ్యాండ్లింగ్ యంత్రాలతో విడిభాగాలను ల్యాండ్ సైడ్‌కు చేరేందుకు గ్రీన్ చానల్ ఏర్పాటు చేశారు. వివిధ టచ్ పాయింట్ల వద్ద ఆన్‌సైట్ కస్టమ్స్ ప్రక్రియను పూర్తిగా వేగంగా అనుమతులు జారీ చేసి షిప్‌మెంట్‌ను పూర్తి చేయిచారు. ఈ– రేసింగ్ కార్లకు సంబంధించిన మరిన్ని విడిభాగాలు కూడా మరో రెండు విమానాల్లో చేరనున్నట్లు ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు.

హైదరాబాద్ కార్గో హబ్

దక్షిణ భారతంలో హైదరాబాద్ కార్గో హబ్‌గా అభివృద్ధి చెందిందని ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణికర్ అన్నారు. దేశంలోనే తొలిసారి జరుగుతున్న ఈ– రేసింగ్ చాంపియన్ షిప్‌లో జీఎంఆర్ హైదరాబాద్ కార్గో ఎయిర్‌కార్గో సదుపాయాలను అందించడం సంతోషంగా ఉందన్నారు.

అభివృద్ధిలో రాష్ట్రం పరుగులు

• మంత్రి సబితారెడ్డి

కందుకూరు: సీఎం కేసీఆర్ కృషితో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతోందని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని గూడూరులో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో మంత్రి పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకెళుతోందన్నారు. అభివృద్ధి పనులకు కావాల్సినన్ని నిధులు మంజూరవుతున్నట్లు తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని సబితారెడ్డి అన్నారు. శ్రీశైలం ఫార్మా రోడ్డు నుంచి గూడూరు గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 1.60 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. నిధులు మంజూరు చేసిన వారం రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బీ జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డీ చంద్రశేఖర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఇందిర, సర్పంచ్ పీ శ్రీలత, ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు లచ్చానాయక్, డైరెక్టర్లు నర్సింహ, ఆనంద్, పారిజాతం, నాయకులు మేఘనాథ్‌రెడ్డి, దేవి, సామయ్య, తాళ్ల కార్తీక్, బీ దీక్షిత్‌రెడ్డి, జంగయ్య, శ్రీకాంత్‌రెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, అలీ, హనుమంత్, పాండు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గూడూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి సబితారెడ్డి తదితరులు

అశోక్‌కుమార్ యాదవ్‌కు డాక్టరేట్



బడంగ్‌పేట్: ఈసీఐఎల్‌లో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న అశోక్‌కుమార్ యాదవ్ పీహెచ్‌డీ పూర్తి చేసి గౌరవ డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఈసీఐఎల్)లో అశోక్‌కుమార్ యాదవ్ డీజీఎంగా పనిచేస్తున్నారు. కాకతీయ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ ఫ్యాకల్టి డీన్‌గా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ టీ శ్రీనివాసులు గైడ్‌గా వ్యవహరించారు. ఫ్యూసన్ స్టార్టజీస్ ఫర్ మల్టీ మోడల్ బయోమెట్రిక్స్ ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ అనే అంశంపై పరిశోధన పత్రాలను సమర్పించినందుకు జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ (జేఎన్‌టీయూహెచ్) డాక్టరేట్‌కు ఎంపిక చేశారని అశోక్‌కుమార్ యాదవ్ తెలిపారు. పరిశోధనకు సహకారం అందించిన ఈసీఐఎల్ మిత్రులకు, పరిశోధనకు సహకరించిన గైడ్ శ్రీనివాసులు, స్నేహితులకు, బంధువులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


జేఎన్‌టీయూ ఇంజనీర్ కాలేజ్ సుల్తాన్‌పూర్ జట్టు


మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల జట్టు

ఉల్లాసంగా..ఉత్సాహంగా..

రసవత్తరంగా 'సాక్షి' ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లు

SPL SAKSHI PREMIER LEAGUE | SAKSHI | SAKSHI DIGITAL MEDIA GROUP

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండలం ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానంలో 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సాక్షి ప్రీమియర్ లీగ్-4 (ఎస్‌పీఎల్)' క్రికెట్ మ్యాచ్‌లు గురువారం ఉల్లాసంగా ఉత్సాహంగా సాగాయి. గ్రేటర్ హైదరాబాద్ నుంచి 65 జట్లు లీగ్‌లో పాల్గొంటున్నాయి.

విజేతల వివరాలు...

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం-1

- మొదటి మ్యాచ్‌లో ఏవీఎన్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 74 పరుగులు సాధించగా ప్రత్యర్థి మల్లారెడ్డి కళాశాల జట్టు 6.4 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 75 పరుగులు చేసి విజయం సాధించింది. మల్లారెడ్డి కళాశాల జట్టు క్రీడాకారుడు షిరిడీనాథ్ 25 బంతుల్లో 51 పరుగులు చేయగా, బౌలర్ మనీశ్ మూడు వికెట్లు తీసి విజయంలో కీలకపాత్ర పోషించారు.
- రెండవ మ్యాచ్‌లో శ్రీ ఇందూ ఇంజనీరింగ్ కళాశాల-ఎ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 118 పరుగులు చేయగా..అనంతరం బ్యాటింగ్ చేసిన మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల-బి జట్టు 81 పరుగులు చేసి పరాజయం పాలయింది. శ్రీ ఇందు కళాశాల జట్టు క్రీడాకారుడు శివ 31 బంతులో 58 పరుగులు చేయగా, వంశీ మూడు వికెట్లు తీశాడు.
- మూడవ మ్యాచ్‌లో శ్రీ ఇందూ ఇంజనీరింగ్ కళాశాల-బి జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 102 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సీఎంఆర్ఐటీ-బి జట్టు 95 పరుగులు చేయడంతో శ్రీ ఇందు కళాశాల జట్టును విజయం వరించింది.

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం-2

- మొదటి మ్యాచ్‌లో మర్రి లక్ష్మారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 105 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన భారత్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు 5 వికెట్లు కోల్పోయి 45 పరుగులు చేయడంతో మర్రి లక్ష్మారెడ్డి జట్టు గెలుపొందింది.
- రెండో మ్యాచ్‌లో మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల-ఎ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన వెస్లీ డిగ్రీ కళాశాల-బి జట్టు 10 ఓవర్లలో 74 పరుగులు చేసి ఓడిపోయింది.
- మూడవ మ్యాచ్‌లో శ్రీ ఇందూ ఫార్మసీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేయగా..అనంతరం బ్యాటింగ్ చేసిన సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల-సి జట్టు 8.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసి విజయం సాధించింది.
- నాలుగో మ్యాచ్‌లో జేఎన్టీయూ సుల్తాన్‌పూర్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 92 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన నల్ల నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 76 పరుగులు చేసి పరాజయం పాలైంది.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT : SHADNAGAR.

I.A.NO. 1527 OF 2022 IN O.S.NO. 106 OF 2020

Between:
Chitkela Srinivas and 8 others ... Plaintiffs
AND
1. To whom so ever Concern
2. Tahsildar Kothur Mandal ... Defendants

NOTICE

The General Public hereby intimated that the above named Sri Chitikela Srinivas S/o Late Yadagiri, Age: 52 years, Occ: Govt. Employee, R/o H.No.7-49, Kummariguda H/o Kothur Village & Mandal, Rangareddy Dist and others filed a suit on the file of Hon'ble Prl. Junior Civil Judge, Shadnagar praying the Hon'ble court to declare them legal heirs of deceased Smt. Chitikela Venkatamma W/o Chitikela Yadagiri R/o Kummariguda, Kothur Mandal R.R. District.

In consideration of said suit the Hon'ble court pleased to its orders directing under signed to publish the notice in daily newspaper calling objections if anybody having, in declaring Sri Chitikela Srinivas and others as legal heirs of Smt Chitikela Venkatamma and if any person or persons may have any objections, such person(s) should appear before the Hon'ble court on the next day of hearing on 20-02-2023 at 10:30 am, failing which the Hon'ble court will proceed with the case basing on the record of the case. Hence this notice.

//As per order of the Hon'ble court//

K.Sreenivas Goud
K.Sreekanth
Advocates
Christian Colony, College Road, Shadngar, R.R. District. 9848069895.

సత్వర వైద్య సేవలకే బస్తీ దవాఖానా

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: నిరుపేదలకు మెరుగైన, సత్వర వైద్య సేవలు అందించేందుకే ప్రభుత్వం బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య తెలంగాణ రాష్ట్ర నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం నిరుపేదలు ఉండే వాడల్లో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తోందని అన్నారు. ఈ దవాఖానాలో డాక్టర్, నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, ఇద్దరు ఏఎన్ఎంలు, అటెండర్ విధులు నిర్వహిస్తారని తెలిపారు. పట్టణం నడిబొడ్డులో బస్తీ దవాఖానా ఏర్పాటుతో ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందన్నా రు. పేదలకు మంచి నాణ్యతతో కూడిన వైద్యాన్ని అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చిందన్నారు. సర్కారు ఆసుపత్రుల్లో కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు, నూతన ఆసుపత్రులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు గాను ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తోందన్నారు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రి అంటే చాలా మందికి మంచి ఉద్దేశం ఉండేది కాదని, ప్రస్తుతం అధిక శాతం మంది ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారని అన్నారు. వైద్యశాఖలో పని చేసే అధికారులు, సిబ్బంది కూడా ప్రజలకు ఆరోగ్య పరమైన అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. నిరుపేదలందరూ బస్తీ దవాఖానాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ వినోద్, జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నట్‌రాజన్, కౌన్సిలర్ వెంకట్‌రాంరెడ్డి, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, కమిషనర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

మాణిక్‌రెడ్డిని గెలిపించాలి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ శాసనమండలి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాపన్నగారి మాణిక్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని యూటీఎఫ్ పిలుపునిచ్చింది. గురువారం పంజాగుట్టలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ గాలయ్య, జిల్లా అధ్యక్షుడు కే గోపాల్ నాయక్, కార్యదర్శి ఎం వెంకటప్ప మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయ, అధ్యాపకుల సంక్షేమం కోసం టీఎస్ యూటీఎఫ్ బలపర్చిన మాణిక్‌రెడ్డిని గెలిపించాలని ఉపాధ్యాయులకు వారు విజ్ఞప్తి చేశారు. నాలుగు దశాబ్దాలుగా, విద్యారంగంలో ఉపాధ్యాయునిగా, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకునిగా, పని చేసిన సుదీర్ఘ అనుభవం ఆయనకు ఉందని తెలిపారు. ఉపాధ్యాయులు అధ్యాపకుల పక్షాన పోరాడే అభ్యర్థినే ఎన్నుకోవాలని సూచించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



శంకర్‌పల్లి: గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు. మండలంలోని దొంతాన్‌పల్లి గ్రామ శివారు శంకర్‌పల్లి - హైదరాబాద్ రోడ్డులో గురువారం గుర్తు తెలియని వ్యక్తి (40) మృతి చెందాడు. ఒంటిపై మాచిన దుస్తులు ఉన్నాయి. ఏదైన వాహనం ఢీ కొట్టిందా? ఎవరైన కొట్టారా? అనే అనుమానం తలెత్తుతోంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి


పెంటయ్య మృతదేహం

కందుకూరు: విద్యుదాఘాతంతో కూలీ మృతి చెందిన సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం ఎల్లంపల్లికి చెందిన పెంటయ్య(55) విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసే కాంట్రాక్టర్ వద్ద కూలీ పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో గురువారం పులిమామిడి-ధన్నారం గ్రామాల పరిధిలో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తుండగా విద్యుదాఘాతంకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని మహేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్


కలెక్టర్ హరీష్‌కు మొక్కను అందజేస్తున్న కమిషనర్ యూసుఫ్

ఇబ్రహీంపట్నం: జిల్లా కలెక్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన హరీష్‌ను ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ యూసుఫ్ గురువారం కలెక్టరేట్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు.

క్షతగాత్రులకు పరామర్శ

ఇబ్రహీంపట్నం: గడ్డమల్లయ్యగూడెంలో ట్రాక్టర్ ఢీకొట్టిన ప్రమాదంలో గాయపడిన వారిని కాంగ్రెస్, బీజేపీ నేతలు గురువారం పరామర్శించారు. ఇబ్రహీంపట్నం లిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ నాయకులు రాములు, దయానంద్‌గౌడ్, నాయిని సత్యనారాయణ, శ్రీశైలం, పీసీసీ కార్యదర్శి దండెం రాంరెడ్డి, ఈసీ శేఖర్‌గౌడ్ వేర్వేరుగా ఆస్పత్రికి వచ్చి పరామర్శించారు.

తెలంగాణ తరహాలో దేశం అభివృద్ధి

అందుకే బీఆర్ఎస్ ఏర్పాటు

• సర్పంచుల సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు భూమన్న యాదవ్

మొయినాబాద్ రూరల్: తెలంగాణ తరహాలో దేశాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని స్థాపించారని సర్పంచుల సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు భూమన్న యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాలను ఆయన సందర్శించి అభివృద్ధి కార్యక్రమాలను తెలుసుకున్నారు. అనంతరం హిమాయత్‌నగర్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో సర్పంచ్‌లు నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్నారని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి సీఎం ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల హామీలను అమలు చేశారని తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచులు సొంత నిధులు వెచ్చించారని ఆ డబ్బును సీఎం కేసీఆర్ మంజూరు చేయాలని కోరారు. బంగారు తెలంగాణ కేసీఆర్‌తోనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి యాదవ్, ఆదిలాబాద్ మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, ఫారూఖ్‌నగర్ మిత్యాల ఎంపీటీసీ దేవి, మాజీ ఎంపీటీసీ లింగం యాదవ్, షాద్‌నగర్ నాయకులు గనోజ్ భాస్కర్‌చారి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న భూమన్నయాదవ్

'ఉపాధి'ని ఎత్తి వేసేందుకు కుట్ర

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య

షాద్‌నగర్ రూరల్: ఉపాధి హామీ పథకాన్ని ఎత్తి వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని గురువారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మొండిచేయి చూపిందని పేర్కొన్నారు. గత బడ్జెట్‌లో ఈ పథకానికి రూ. 73వేల కోట్లు కేటాయించిన కేంద్రం ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం రూ. 60వేల కోట్లను మాత్రమే కేటాయించడం జరిగిందన్నారు. పలు షరతులు పెట్టి ఉపాధి పనులు జరుగుకుండా చేసిందని ఆరోపించారు. బడ్జెట్‌లో రూ. 2లక్షల కోట్లు కేటాయించాలని, 200 రోజులు పని దినాలను కల్పించాలని, అలాగే రోజు కూలి రూ. 600 చెల్లించాలన్న డిమాండ్‌ను పక్కన పెట్టడం సరికాదన్నారు. పెట్టుబడిదారులకు, బడా వ్యాపారులకు రాయితీలు ఇస్తూ పేదల పథకాల్లో కోతలు విధించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పెరిగిన ధరలతో పేదలు ఏమీ కొనలేని, తినలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు గిట్టుబాటు ధర కోసం చట్టం చేస్తామని చెప్పిన కేంద్రం ఆ దిశగా చర్యలు తీసుకోలేదని తెలిపారు.


బుద్దుల జంగయ్య

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బోధన

• 'మనఊరు-మనబడి'తో పాఠశాలలకు మహర్దశ
• ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల్లో విద్యాబోధన ఉంటుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మనఊరు-మనబడి కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని మహారాజ్‌పేట్ గ్రామంలో నూతనంగా నిర్మించిన తరగతి గదులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం మన ఊరు-మన బడి కార్యక్రమం ద్వారా కోట్ల రూపాయలు ఖర్చు చేసి మౌలిక వసతులు కల్పించడం జరుగుతోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో ఆంగ్ల మధ్యమంలో కంప్యూటర్ విద్యను కూడా అందించడం జరుగుతోందని గుర్తుచేశారు. గతంలో కంటే ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. పేదల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, ఎంపీడీవో వెంకయ్యగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు, వైస్ చైర్మన్ కురుమ వెంకటేష్, సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, రవీందర్‌గౌడ్, పాడువు శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, అశ్విని, ప్రధానోపాధ్యాయులు జీవనజ్యోతి, తాహెర్ అలీ, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

చేవెళ్ల: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని గొల్లగూడ, మల్లారెడ్డి గూడ గ్రామాల్లో పంచాయతీ నూతన భవన నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. మల్లారెడ్డిగూడ, ఎర్రోని కోట గ్రామాల్లో రూ. 13.75లక్షలతో వేసిన సీసీ రోడ్లకు స్థానిక సర్పంచ్ ఎం మోహన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. నియోజకవర్గానికి మంత్రి కేటీఆర్ సహకారంతో రూ. 25కోట్ల నిధులు తీసుకురావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మల్లారెడ్డిగూడ సర్పంచ్ మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ రాధిక, గొల్లగూడ సర్పంచ్ రాంచంద్రయ్య, ఎంపీటీసీలు రవీందర్, ఎంపీపీ ఎం. విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం మాలతి, వైస్ ఎంపీపీ కే శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చేవెళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు అత్తెల్లి రాఘవేందర్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య